క్లుప్తంగా

మంత్రిని కలసిన ఎస్పీ



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పాలసముద్రం సమీపంలో గురువారం జరిగిన నాసిన్ (నేషనల్ అకాడమి ఆఫ్ కస్టమ్స్ ఇండిరెక్ట్‌టెక్స్ అండ్ నార్కోటిక్స్) సమీక్షా సమావేశానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, శాసన వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



తిరుపతి మృతదేహం

తనకల్లు: స్థానిక పాత పెట్రోల్ బంకు వద్ద గురువారం రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో తిరుపతి (18) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు... రాచువారిపల్లికి చెందిన తిరుపతి బైక్‌లో తనకల్లు నుంచి గ్రామానికి వెళ్తూ పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఈతోడు నుంచి బైక్‌లో వస్తున్న ప్రసాద్ ఢీకొన్నాడు. ప్రమాదంలో తిరుపతికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బత్తలపల్లి: మండలంలోని అప్పరాచెరువు పంచాయతీ పరిధిలోని చెన్నరాయపట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుజ్జల ముసలన్న(75) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకుడు లింగమయ్య తదితరులు గ్రామానికి వెళ్లి ముసలన్న భౌతికకాయానికి నివాళులర్పించారు.

క్రికెట్ టోర్నీ విజేత అగ్రహారం



విజేత అగ్రహారం జట్టు సభ్యులతో అధికారులు, నాయకులు

నల్లమాడ: మండలంలోని వేళ్లమద్ది వద్ద రమేష్ నాయక్ యువసైన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా బుక్కపట్నం మండలం అగ్రహారం జట్టు నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వేళ్లమద్ది, అగ్రహారం జట్లు తలపడగా అగ్రహారం జట్టు గెలుపొందింది. తహసీల్దార్ దేవేంద్రనాయక్, దుంగావత్ రాజునాయక్ ముఖ్య అతిథులుగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.20 వేలు నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. సర్పంచ్ బొజ్జేనాయక్, నాయకులు మట్రా రాజశేఖర్, నారాయణస్వామి నాయక్, చిన్నపరెడ్డి, రాంమోహన్, శీనా, భాస్కర్‌నాయక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

తనకల్లు: మబ్బువారిపల్లిలో కామేశ్వర్‌రెడ్డి (25) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాంభూపాల్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి కుమారుడైన కామేశ్వర్‌రెడ్డి బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఏం జరిగిందో తెలియదు కానీ బుధవారం సాయంత్రం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. అనంతపురం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

16న వైద్య శిబిరం

కదిరి టౌన్: పట్టణంలోని రాణిపేట స్కూల్‌లో ఈనెల 16న కంటి, గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రిషిత చిన్న పిల్లల వైద్యులు సీవీ మదన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వలంటీర్లకు వందనం

దేవుడిలా ఆదుకున్నాడు



కూరగాయలు అందజేస్తున్న వలంటీర్ బాబా మహమ్మద్

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని జామీయమసీదు, కంచుకోట ఏరియాలో కరోనా కాలంలో 22వ వార్డు వలంటీర్ బాబా మహమ్మద్ స్థానికులకు అండగా నిలిచాడు. కంచుకోటకు చెందిన షంషాద్ అనే మహిళకు కరోనా వచ్చింది. ఆ సమయంలో బంధువులు కూడా అటువైపు కన్నెత్తి చూడలేదు. ఆ సమయంలో వలంటీర్ బాబా మహమ్మద్ షంషాద్ కుటుంబాన్ని ఆదుకున్నాడు. కరోనా నుంచి బయట పడేవరకు నిత్యవసర సరుకులను అందజేశారు. వార్డు ఏఎన్ఎం ఇచ్చిన మందుల కిట్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు.

కరోనా నుంచి వలంటీర్ వల్లనే బయట పడ్డాం

వలంటీర్ వల్ల మా కుటుంబం ఆరోగ్యంగా ఉంది. వలంటీర్ నాకే కాదు వార్డులో ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తారు. వార్డులో రెడ్‌జోన్ ఉండగా వలంటీర్, మున్సిపల్ సిబ్బంది వార్డుకు వచ్చి బ్లీచింగ్ చల్లించారు. ప్రతి నెల ఉదయం 6 గంటలకే పింఛన్ అందజేస్తారు

షంషాద్, కంచుకోట వీధి, కదిరి

రెడ్‌జోన్‌లోకి వెళ్లి సేవలు



అనంతపురం ఆస్పత్రిలో రవిచంద్రకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రభాకర్ యాదవ్

కదిరి పట్టణంలోని మూర్తిపల్లి ఎమ్మెల్యే కాలనీకి చెందిన రవిచంద్ర కుటుంబానికి కరోనా కష్టంలో వలంటీర్ ప్రభాకర్ యాదవ్ అండగా నిలిచారు. రెడ్ జోన్‌లో ఉన్న రవిచంద్ర ఇంటికి వలంటీర్ వెళ్లి నిత్యావసర వస్తువులు అందజేయడంతోపాటు కుటుంబ సభ్యులకు ఇంటివద్దే కోవిడ్ పరీక్షలు చేయించారు. ప్రభుత్వం అందించిన వెయ్యి రూపాయల సాయాన్ని అందజేశారు. రవిచంద్రకు ఆరోగ్యం సరిగా లేకపోతే అనంతపురం సవేరా ఆస్పత్రిలో చేరగా వలంటీర్ వెళ్లి పింఛన్ అందజేశారు.

వలంటీర్‌కు రుణపడి ఉంటాం

కరోనా కష్టకాలంలో వలంటీర్ ప్రభాకర్ యాదవ్ అండగా నిలిచారు. ఇంటికి వచ్చి సేవలు అందజేశారు. నేను ఆస్పత్రిలో ఉండగా వచ్చి పింఛన్ అందజేశారు. అమ్మ ఒడికి ఈకేవైసీ చేయించారు. దీంతో మా పిల్లలకు విద్యాదీవెన, వసతిదీవెన అందుతున్నాయి. వలంటీర్‌కు రుణపడి ఉంటాం

రవిచంద్ర, మూర్తిపల్లి ఏరియా కదిరి

త్వరలో గ్రంథాలయ భవన నిర్మాణం



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్

కదిరి అర్బన్: పట్టణంలోని కోర్టు రోడ్డులో ఉన్న ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్ గురువారం సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఉర్దూ అకాడమీ గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరైందన్నారు. త్వరలోనే స్థలం కేటాయించి భవన నిర్మాణాన్ని చేపడుతామన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎం.బండమీదపల్లిలో ఎంపీడీఓ సాల్మన్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 191 మందికి సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పథకాలు టీడీపీ వారికి మాత్రమే అందేవన్నారు. తమ ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందజేస్తోందన్నారు. 8 కిలో మీటర్ల బండమీదపల్లి గడ చెరువు కాలువ నిర్మాణానికి రూ.కోటి కూడా ఖర్చుకాదని, రూ.8 కోట్లు టీడీపీ నాయకులు తీసుకున్నారన్నారు. దాతలు, రైతులు, కార్యకర్తల సహకారంతో 80 కిలో మీటర్ల మేర కాలువ నిర్మాణం చేపట్టామన్నారు.

మంచి చేసే వలంటీర్లను తిడతారా :

కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఇంట్లో నుంచి బయటకు రాలేని సమయంలో కూడా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారన్నారు. అలాంటి సేవకులనే పవన్ కళ్యాణ్ తిడతారా ? అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు లంచాలకు, దుర్మార్గపు పనులకు తెరలెపితే వలంటీర్లు అందుకు భిన్నంగా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మెలిగి సేవలందించారన్నారు. సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్రమోదీ వలంటీర్ల సేవలు భేష్ అంటూ ప్రశంసించారన్నారు. వలంటీర్లపై పగటి వేషగాడు పవన్ కళ్యాణ్ వారాహి అని ఒక రథయాత్ర పేరుతో తిరుగుతున్నాడని, నిజంగా 50 ఇళ్లకు వెళ్లి నిరంతం సేవ చేసి చూడు, అప్పుడు వలంటీర్లు చేస్తున్న సేవ కనిపిస్తుందన్నారు. ఎమ్మెల్యేగా, వార్డు మెంబర్‌గా కూడా గెలవలేవని, నీకంటే ఉన్నతమైన స్థానంలో ఉన్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పవన్‌కళ్యాణ్‌కు తగదన్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత కూడా కరోనాకు భయపడి అడ్రస్ లేకుండా పోతే.. నా కుటుంబ సభ్యులందరం పేదలకు సరుకులు అందించామన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం :

సీఎం జగన్ ప్రవేశ పెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే అన్నారు. ఎం.బండమీదపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ సాల్మన్, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, హౌసింగ్ ఏఈ రామ్మూర్తి, ఎంపీపీ జయలక్ష్మీ, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేపట్టనటువంటి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి కుటుంబానికీ ఏడాదికి రూ. లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆర్థిక వెసులుబాటు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని గుండువారిపల్లి పంచాయతీ గుండువారిపల్లి, పూలవాండ్లపల్లి, ఎర్రిపల్లి, మామిళ్లివారిపల్లి గ్రామాలలో గురువారం సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, ఎంపీపీ రఫినాయక్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి తిరిగి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోమారు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామక్రిష్టారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సూర్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఫయాజ్ అహమ్మద్, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ జయంతి, రఘురాములు, మల్లినాయుడు, రాజగోపాల్‌నాయుడు, మోహన్‌నాయుడు, కోటి వీరమనాయుడు, సాయి, కొండయ్య, వీరమనాయుడు పాల్గొన్నారు.

గడప గడపకూ వెళ్లి సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. ఇంటి పన్ను ఎక్కువగా వచ్చిందని, వార్డుపేరు కూడా మారిందని ఓ వృద్ధురాలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చింది. సమస్య పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు పేర్కొనగా త్వరలోనే సీసీ రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. జగనన్న కాలనీలో ఇంటి బిల్లులు పడలేదని ఒక మహిళ పేర్కొనగా సచివాలయ సిబ్బందిని పిలిపించి ఆరా తీశారు. ఆన్‌లైన్‌లో ఉందని, ఇల్లు కట్టుకోండి బిల్లు పడుతుందని ఎమ్మెల్యే సూచించారు. విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని పలువురు కోరగా తగు చర్యలు తీసుకోవాలని ఏఈకి ఎమ్మెల్యే సూచించారు. కౌన్సిలర్ శంకర్ తేజేశ్వర్, నాయకులు శంకర్ యుగంధర్ పాల్గొన్నారు.

అనుమతులు లేకపోయినా శ్రీచైతన్యలో తరగతులు



కొత్తచెరువులోని శ్రీచైతన్య పాఠశాలలో ఆరు బయట విద్యార్థులు

సాక్షి, పుట్టపర్తి: జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయానికి కూత వేటు దూరంలో నిర్వహిస్తోన్న శ్రీచైతన్య పాఠశాలకు అనుమతులు లేవు. దీంతో రెండు వారాల క్రితం అప్పటి ఇన్‌చార్జి డీఈఓ రంగస్వామి వెళ్లి సీజ్ చేశారు. అయితే నిర్వాహకులు మరుసటి రోజు నుంచి తరగతులు నిర్వహిస్తున్నారు. అనుమతులు వస్తాయని నమ్మబలికి సుమారు 700 మందికి ప్రవేశాలు కల్పించారు. స్కూల్ ఫీజులు, పుస్తకాలకు ప్రత్యేకం, బస్సు సౌకర్యం అంటూ ఫీజులు దండుకుంటున్నారు. అయితే విద్యార్థులకు సరిపడా రవాణా సౌకర్యాలు కల్పించలేదు. ఓ బస్సు వెళ్లి పది గ్రామాలు తిరిగి వచ్చేంత వరకు తరగతి బయట నేలపైన కూర్చుని వేచి ఉండాల్సి వస్తోంది. మరోవైపు ఈ పాఠశాలకు అనుమతులు రాలేదని.. విద్యార్థులను చేర్పించవద్దని విద్యా శాఖాధికారులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

ధర్మవరం రూరల్: ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ల్యాబ్ రూం, మందుల స్టాక్ రూం తదితర వాటిని పరిశీలించారు. రోగులకు అందించే చికిత్సలపై డాక్టర్ జగదీష్‌తో ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

బత్తలపల్లి: తంబాపురం సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచు సానే జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సౌజన్యకుమారి తెలిపారు.

తాడిమర్రి: చిన్నచిగుళ్లరేవు గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైస్ చైర్మన్‌కు అభినందనలు

బత్తలపల్లి:ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన జయరామిరెడ్డిని బత్తలపల్లి ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి అభినందనలు తెలిపారు. సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, బండి నాగభూషణ, ముసలప్ప పాల్గొన్నారు.

నేడు బత్తలపల్లిలో 'గుడ్ మార్నింగ్'

బత్తలపల్లి: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం మండల కేంద్రంలో గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ కోటి సుధ తెలిపారు. అనంత రూరల్ స్కూల్ వద్దనుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

మహిళకు గాయాలు

గాండ్లపెంట: మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లిలో బుధవారం రమేష్‌నాయక్ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ సుజాత అనే మహిళను ఢీకొన్నాడు. ఆమె కుడికాలికి గాయమైంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

లెక్చరర్ వేధిస్తున్నాడని ఫిర్యాదు

కదిరి టౌన్: పట్టణంలోని అమృతవల్లి కళాశాలలో చదువుతున్న విద్యార్థినులను వివేకానంద కళాశాల అధ్యాపకుడు నాగరాజు వేధిస్తున్నాడని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. ఈమేరకు గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మగ్బుల్ బాషాకు ఫిర్యాదు చేశారు. బాబ్జాన్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

16న బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

అమడగూరు: గోరంట్ల ఎస్ఎల్ఎన్ కల్యాణ మండపంలో ఈ నెల 16న జరగబోయే బ్రాహ్మణ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పంచరత్నం సురేష్‌శర్మ విజ్ఞప్తి చేశారు.

లాటరీ టికెట్ల విక్రేత అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలోని పూల బజారులో లాటరీ టికెట్లు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సీఐ మధు ఆధ్వర్యంలో గురువారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నవీన్‌కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రూ. 27 వేల నగదు, లాటరీ టికెట్లను స్వాధీనం చేసుకున్నారు.

దేశం కోసం శ్రమించాలి

కదిరి అర్బన్: ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'మేరీ మట్టి మేరా దేశ్' కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం శ్రమించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన

తాడిమర్రి: ప్రాణాంతక మహమ్మారి డెంగీ వ్యాధి సోకకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కృష్ణప్రసాద్ గ్రామస్తులకు సూచించారు. స్థానిక బీసీ కాలనీలోని గంగమ్మ గుడి వద్ద గురువారం ఏర్పాటు చేసిన గ్రామస్తుల సమావేశంలో ఆయన పాల్గొని డెంగీ వ్యాధి గురించి అవగాహన కల్పించారు.

బత్తలపల్లి: విషజ్వరాలు, ప్రాణాంతక వ్యాధులపై దంపెట్ల, తంబాపురం, రామాపురంల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ధర్మవరం రూరల్: పోతుకుంట గ్రామంలో డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో జ్వరాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర బాధితులనుంచి రక్తనమూనాలు సేకరించారు.



తాడిమర్రిలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

నివాళులర్పించిన ఎమ్మెల్యే

తలుపుల: మండల కేంద్రం మాడికవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్ రెడ్డి తల్లి సుబ్బమ్మ (80) అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందింది. ఎమ్మెల్యే సిద్దారెడ్డి అక్కడకు వెళ్లి సుబ్బమ్మ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, ఎంపీపీ రఫినాయక్, టీపీ రమణ, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి వెళ్లి సుబ్బమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

నల్లచెరువు: ఇటీవల అనారోగ్యంతో మరణించిన త్యారన్నగారి పల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వెంకట శివారెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. వెంకట శివారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస రెడ్డి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన గ్రాసంతో అధిక పాల దిగుబడి



పశుగ్రాస ప్రా ముఖ్యతను వివరిస్తున్న చంద్రశేఖర్

ధర్మవరం రూరల్: నాణ్యమైన పశు గ్రాసంతో అధిక పాల దిగుబడి వస్తుందని ధర్మవరం డివిజన్ పశువర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌లో భాగంగా మండల పరిధిలోని చింతలపల్లిలో గురువారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 శాతం సబ్సిడీతో పశు గ్రాసం విత్తనాలను రైతుకు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సర్పంచ్ నాగానందరెడ్డి, ముదిగుబ్బ పశువైద్యాధికారి రామేశ్వరరావు పాల్గొన్నారు.

సజావుగా వేలం పాట

నల్లచెరువు: శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో పూజా సామగ్రి విక్రయం, వాహనాల పార్కింగ్ రుసుము వసూలుకు గురువారం వేలం నిర్వహించారు. టెంకాయలు, పూజా సామగ్రి విక్రయం కోసం రూ.4 లక్షలకు రాములయ్య, పూలహారాలు, విడిపూలు విక్రయానికి రూ.67వేలకు ఎం రమణా నాయక్, వాహనాల పార్కింగ్ రుసుము వసూలుకు రూ.73 వేలకు గోవిందు హక్కులు పొందారు. ఎంపీపీ రమణారెడ్డి, ఈఓ రామాంజనేయులు,ఆలయ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, చైర్మన్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

ముదిగుబ్బ: స్థానిక కేజీబీవీ పాఠశాలలో డెంగీ మాసోత్సవాలను నిర్వహించారు. డెంగీ జ్వరం లక్షణాలపై విద్యార్థినులకు డాక్టర్ రాజేంద్ర అవగాహన కల్పించారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ న్యాయం



గంగిరెడ్డిపల్లిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



యలకుంట్లలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్/ ఎన్‌పీకుంట/గాండ్లపెంట/అమడగూరు/ముదిగుబ్బ/నల్లమాడ/నల్లచెరువు/ధర్మవరం రూరల్/పుట్టపర్తిటౌన్:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శుభదాస్ పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డితో కలిసి 712 మందికి సేవా సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ కామాక్షమ్మ, ఎంపీటీసీ కుల్లాయప్ప, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగాద్రి, హౌసింగ్ ఏఈ గౌస్‌మోహిదీన్, ఏడీఏ సనావుల్లా, డీటీ నరసింహులు, ఎస్ఐ దాదాపీర్ పాల్గొన్నారు. ఎన్‌పీకుంట గౌకనపల్లి గ్రామ సచివాలయం పరిధిలో 673 టోకెన్లు జనరేట్ చేయగా 621 సమస్యలను పరిష్కరించి ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. గాండ్లపెంట మండలం వేపరాల గ్రామ సచివాలయంలో 606 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. అమడగూరు మండలంలోని జౌకలకొత్తపల్లిలో 728 మందికి సర్టిఫికెట్లను మంజూరు చేశారు. ముదిగుబ్బ మండలం సానేవారిపల్లి, కొండగట్టుపల్లి గ్రామ సచివాలయాల్లో సర్టిఫికెట్లు అందజేశారు. నల్లమాడ మండలం పాతబత్తలపల్లి గ్రామ సచివాలయం పరిధిలో 1,018 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. నల్లచెరువు మండలం ఉబిచర్ల సచివాలయ పరిధిలో 822 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ధర్మవరం రూరల్ పరిధిలోని ఏలుకుంట్ల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. పుట్టపర్తి మండలం కొత్తచెరువు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, మిత్ర బృందం

ధర్మవరం: వికలాంగులకు ట్రై సైకిళ్లు అందించి చేయూతనివ్వడం హర్షనీయమేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నూతనంగా మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వేముల జయరామిరెడ్డి, మిత్ర బృందం సభ్యులు డీఎల్ లక్ష్మీనారాయణ, ఉక్కిశిల గోవిందు, మామిళ్ల మురళి, ఓంకార్ శీన, సుధాకర్, శాగా శ్రీనివాసులు, మేకల కృష్ణప్రసాద్ సహకారంతో పది మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, మిత్ర బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని వారికి సూచించారు.